# పాలరాళ్ల ప్రేమచిహ్నం

స్వామి రమ్మన్నప్పుడూ, తర్వాత దారిలోనూ నేను చేసిన వితండ వాదన గుర్తుకు వచ్చి, నన్ను చూస్తే నాకే విచారం కలిగించేలా చేసింది.

అప్పుడు "తాజ్‌మహల్ నిర్మాణానికి, రాళ్లెత్తిన కూలీ లెవ్వరు?.... ఇది కాదోయ్ చరిత్రకర్థం!" అని శ్రీశ్రీ గొంతుచించుకుని పాడుతుండడం, ఏ పాతాళ లోకాల్లోంచో వినపడుతున్నట్టు, కొంచెం కొంచెంగానూ, హెచ్చు స్వరంతోనూ వినపడేది.

అందుకే చారిత్రక ప్రదేశాలు చూడ్డానికి నేను అయిష్టపడింది. మనం నిజమైన చరిత్రనీ, ఆనాటి వాస్తవిక చిహ్నాల్నీ అక్కడ చూడం. వొట్టి, అల్లబడిన గాథలకి సంబంధించిన శిధిలాల్నే చూస్తాం.

"రేపు క్రిష్టమస్ సెలవలకి ఆగ్రా వెళ్ళాలి మీరు కూడా తప్పకుండా వస్తారనుకుంటున్నాం" అని స్వామిఅన్నాడు.

"ఎందుకు?" అన్నాను. తెలియదు. పైకి మాత్రం అన్నాడు.

"ఎక్స్‌కర్షన్! తాజ్‌మహల్‌ని చూడ్డానికి!"

"ఆ రాజరికపు చిహ్నాన్నా?" నా కళ్లల్లో ఆ సమయంలో కోపం కనపడి వుంటుందనుకుంటాను. నిజానికి అంతగా వొళ్లు మండుకు పోయింది. ప్రజల రక్త మాంసాలని అన్ని విధాలా పీల్చుకు, పిప్పిచేసి, వాటితో యెన్నో కళాక్షేత్రాల్ని ఏ భార్యల కోరికలపైనో, లేకపోతే ఏ పేరు కోసమో నిర్మించిన పూర్వపు రాజుల స్వభావాన్ని తల్చుకుంటే ముఖం కంది పోసాగింది. ఈనాడు వడ్డీలకి వడ్డీలు అమాయకులైన రైతు, కూలీలనించి వసూలుచేసి ధర్మసత్రాలు కట్టించే వణిక్ప్రముఖుల ధర్మాచరణలకంటె ఆ రాజుల చర్యల్లో గొప్ప యేమీ కన్పించలేదు నాకు.

కాని అది కొన్ని వందల మైళ్ళ దూరంనించి అన్నమాట!

ఇప్పటి మనోభావం వేరు. అయినా ఇదివరకటి నా వుద్దేశాలు పూర్తిగా తప్పుకాదనే నమ్మకం మనస్సులో ఇంకా లేకపోలేదు.

సంతోషపు ఔనత్యాన్ని మనస్సు రుచి చూసిన రాత్రి. అది అంత ఆనందానుభవం పొందాను ఎవరికైనా అంతే! అద్వితీయానంద భరితులౌతారు. అబద్ధమాడ్డంలేదు.

గాఢమైన నిశ్శబ్దం పరిపాలనా సాగిస్తున్న రాత్రి! ఆయనా, ఇంకా ఒకరిద్దరు మిత్రులూ, నేనూ అక్కడికి వెళ్ళాం....

పొగమంచుని చీల్చుకుని వచ్చిన చంద్రకాంతి, పాలరాళ్లలో ప్రతిఫలించి, మళ్ళా పొగ మంచులో దారి తెలియకుండా కొట్టుకుంటుంటే చూడ గలగడం ఒక గొప్ప వరంగా వును అనిపించింది. పిండి ఆరబోసినట్టన్న పండువెన్నెల! మన నీడల్నీ, మనకి మన ప్రతిబింబాన్ని చూపిస్తున్న పాలరాళ్లు! వర్ననకి నాకు మాటల అర్థాలకున్న శక్తి చాలనట్టుగా తోస్తోంది. అంత గొప్పగానూ, ఆహ్లాదకరంగానూ వుంది ఆ దృశ్యం.

అమితమైన నిశ్శబ్దం చెట్ల నీడల్ని పట్టుకుని వెళ్ళాడే చీకట్లూ కొంత వరకూ విషాదస్ఫురణ కలిగించక పోలేదు.

చలికూడా యెక్కువగా వచ్చేంది. స్వామికి ఎంతగా చలినుంచి కాపాడుకుంటున్నా కొంత రొంప కూడా పట్టింది ఆయన డాక్టరు. అందుకేనేమో అంతగా మంచి ఆరోగ్యంలో వుంటున్నట్టు కనిపించడు.

అందరికీ కూడా అంతేగావును! మాట్లాడ లేనంత గొప్పతనాన్ని ఆనందిస్తున్నారు. యేదో ఒక నిమిషంలోనో ఐపోయ్యేదానిలా! స్వామి 'ఇప్పటికన్నా మీ పొరపాటు గ్రహించారా?' అన్నట్టు అప్పుడిప్పుడు నా వైపు చూడసాగాడు. నేను కూడా నా కళ్ళని గిల్టీగా చూడడం అనేదాన్నించి తప్పించలేకపోయాను. ఎంత బలవంతంగా ప్రయత్నించినా,

ఆ దివ్య భవనంలో ప్రతిబింబించిన మధ్యయుగపు కళాసౌందర్యం కూడా నన్నాకర్షించకపోలేదు. ప్రపంచపు గొప్ప వింతల్లో ముఖ్యమైన వాటిలో ఒకటి! భారతీయ కళాక్షేత్రాల్లో ముఖ్యమైంది!!

పగలు చూసి ఆనందించింది చాలక మళ్లీ ఇపుడు తీసుకవచ్చాడు స్వామి, అతని లెక్క సరి అయిందే అంత కంటే వెయ్యిరెట్లు అత్యధిక సౌందర్యాన్ని చూడగలిగాం మేం, ఆ వెన్నెల్లో

పహరావాడు ఆవలిస్తున్నాడు. ఆవరణ దాటి బయట పడేటప్పటికి పన్నెండు దాటింది. మనస్సులో అచ్చుపడిన చిత్రం మాత్రం మొన్నటికి తుడుచుకుపోదనే నమ్మకంతో అందరం ఇవతల కొచ్చాం. కొన్ని వందల సంవత్సరాల చరిత్రని దాచుకున్న ఆ భవనం కనుచూపు దూరం దాటే వరకూ తిరిగి తిరిగి మా దృష్టిని ఆకర్షించుకుని మనస్సుని ఇంకా దోచుకుంది.

అప్పుడే నాకో వింత అనుభవం కలిగింది. ఆ దివ్య భవనంకంటె వెయ్యిరెట్లు అందంగానూ, ఆకర్షణీయంగానూ వున్నట్టుగా తోచి ముంతాజ్‌మహల్ ముఖం కనిపించి నట్టేయింది. అవును, అది ప్రేమ చిహ్నం, కదూ!

కాని ఒకందుకే విచారం కలిగింది, తర్వాత.

స్వామి ఇంటికి వెళ్ళాక అన్నాడు "మీరు తాజ్‌మహల్‌ని చూస్తున్నప్పుడు శ్రీశ్రీ వాక్యం గుర్తుకు వచ్చిందా?"

"ఏం?" అన్నాను నేను, అనాలోచితంగా నాకు అసలు ఆ మాటే గుర్తులేదు, నిజానికి

కొంతసేపయ్యాక స్వామి అన్నాడు, రగ్గుతో కాళ్ళనించి తలవరకూ కప్పుకుంటూ.

"అదా మీరు చూసింది? అంతసేపు" అదొక చారిత్రాత్మక ప్రదేశమనే సంగతే మర్చిపోయారన్నమాట? దాని గొప్పతనం అనుభవించడంతో అన్నీ గుర్తుకు రావులెండి.

"నాకుమాత్రం అట్లాకాలేదు. యెందుకంటే రాయి రాయికీ వెనకాల యింకో చరిత్రకన్పించింది, నాకు వాటిని అక్కడ పదిలంగాపెట్టి భవన నిర్మాణానికి తోడ్పడిన కూలీల చెమట బిందువుల్ని స్పష్టంగా చూడగలిగాను.

"ప్రతీ చెక్కడంలోనూ ఆ చిత్రకారుల పరిశ్రమ చూడగలిగాను ఒక మాటలో చెప్పాలంటే ఆ భవనంలోని ప్రతీ అంగుళం తనలో యెంతో చరిత్రని, సాధారణ మానవులు గ్రహించని చరిత్రని నిలువ చేసుకుని వుండడంకనిపించింది. నాకు 'ఇతిహాసపు చీకటి కోణం అట్టడుగున పడికాన్పించని' చరిత్రంతా నన్నడుగుతే తాజ్‌మహల్ విలువ కట్టశక్యం కానిది! షాజహాన్ యెంతో అభినందనీయుడు! అతను ముంతాజ్ మరణం తరువాత కార్చిన కంటి నీటి బొట్టుకొక వరహాగా ఖర్చునేసి ఆ భవనాన్ని నిర్మించి వున్నాడనుకుంటాను. దాన్ని తన ప్రేమచిహ్నంగా, ప్రియురాలి మీద ఇష్టం కొలిదీ అతను కట్టించాడు. సాధారణ మానవులూ, చరిత్రకారులూ అంతే చూడ గలుగుతారు. అట్లానే గౌరవిస్తారు కూడా.

"కాని ఆ భవనం వెనకాల యెంత మందో కష్టజీవుల జీవిత చరిత్రల్నీ, శిల్పుల శిల్ప చాతుర్యాన్నీ తరతరాల వరకూ నిలిచేలా చేశాడంటాను. అతను నిర్మించదల్చుకున్నది తన ప్రేయసికి ప్రేమ చిహ్నం. కాని నిజంగా నిర్మించింది వేలకొలదీ కార్మికుల, శిల్పు జీవితాల ప్రతిబింబాన్ని"

తర్వాత స్వామి మౌనంలో పడ్డాడు. నిద్దరోయాడేమో కూడా నాకు చెమటలు గక్కుకుంటూ తాజ్‌మహల్ని నిర్మిస్తున్న శిల్పులూ, కార్మికులూ, తయారవుతున్న ప్రతిదాన్ని కళ్ళనీళ్లు కార్చుకుంటోనే, ఆత్మసంతృప్తికోసం పరీక్షచేస్తున్న షాజహానూ కళ్లకి కట్టినట్టయ్యారు.

'అవును, అది పాలరాళ్ల ప్రేమచిహ్నం - ముంతాజ్‌ది కాదు వేలకొలదీ కార్మికులది' అనుకున్నాను నేను, నిద్రపోడానికి ప్రయత్నిస్తూ.